క్లుప్తంగా

సత్యసాయి చిత్రపటానికి పల్లకిసేవ



మెయిన్‌రోడ్డులో సత్యసాయి చిత్రపటం ఊరేగిస్తున్న భక్తులు

రాజాం సిటీ: భగవాన్ శ్రీసత్యసాయిబాబా చిత్రపటాన్ని బాబా భక్తులు శుక్రవారం ఊరేగించారు. స్వామివారి అవతార ప్రకటన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు మాధవబజార్, బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డులో పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యం, శివం, సుందరం మందిరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



కొలువుతీరిన బొమ్మలు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రకాల బొమ్మలను ఏర్పాటుచేశారు. ఈ కొలువు విజయదశమి వరకు కొనసాగుతుందని ఆయల పూజారి రవిశర్మ తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులకు తొలి ప్రాధాన్యం



ఏపీఓకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పనుల గుర్తింపులో రైతులు, గ్రామస్తులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏపీఓతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. రైతులు, వేతనదారులు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



గొల్లాదిలో అవగాహన కల్పిస్తున్న ఏపీజీవీబీ ఎఫ్‌ఐసీ సూర్యచంద్రరావు

బాడంగి: గ్రామాల్లోని రైతులు, డ్వాక్రా మహిళలు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు కార్యకలాపాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే మరింత ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని విశాఖ గ్రామీణ బ్యాంకు ఎఫ్‌ఐసీ సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని గొల్లాది, గజరాయునివలస గ్రామాల్లో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా నిర్వహించారు. ఏపీజీవీబీ మేనేజర్ వెంకటేష్ బ్యాంకు ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, బీమా పథకం, బగారు ఆభరణాలపై రుణాలు, వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బి.శంకరరావు, ఎం.సత్తిబాబు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యో సురక్ష శిబిరాల్లో 6,669 ఓపీ నమోదు

రామభద్రపురం: మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైద్యులు పి.దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష, బి.రత్నదీపక్, షారూక్, హారిక, ఆర్.సునీత తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. మండలంలో ఆరోగ్య సురక్ష శిబిరాలు పూర్తయినట్లు తెలిపారు. 17 సచివాలయాల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాగా.. 6669 ఓపీలు నమోదైనట్లు వెల్లడించారు. 1069 మందికి బీపీ, 900 మందికి డయాబెటీస్, 449 మందికి పీడియాట్రిక్స్, డెంటల్ 51, ఆర్థోపెడిక్ 152, చర్మ సంబంధిత సమస్యలు 38, ఆప్తమాలజీ 1290, 259 మందికి ఈసీజీ వైద్యపరీక్షలు చేసినట్లు చెప్పారు. 85 మంది రోగులకు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మల్లిక్, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారు



బొబ్బిలి: గొల్లపల్లిలో పూజలందుకుంటున్న దాడితల్లి అమ్మవారు



బొబ్బిలి: కృష్ణాపురం కనకదుర్గాదేవి ఆలయంలో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మూలా నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాల వద్ద బారులుతీరారు. కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ మెంబర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: నందబలగ దుర్గాదేవి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



బొబ్బిలి: బైపాస్ రోడ్డులో పూజలందుకుంటున్న దాడితల్లి అమ్మవారు



రేగిడి: ఉంగరాడమెట్ట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజాం: కంచరాంలో 108 కలశాలతో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు వెంకటరమణశర్మ



రేగిడి: ఉంగరాడ దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజాం సిటీ: పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న నవదుర్గమాత



రామభద్రపురం: రామభద్రపురం దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



వంగర: రుషింగి దుర్గాదేవీ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

జగనన్న ఆరోగ్య సురక్ష.. దేశానికే ఆదర్శం



వంగర: మగ్గూరులో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



రాజాం: ఒమ్మిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



తెర్లాం: విజయరాంపురంలో రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజలకు ఇంటి వద్దకే వెళ్లి మెరుగైన వైద్య సేవలందించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వంగర మండలంలోని మగ్గూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పలువురు రోగులకు మందుల కిట్లు, హెల్త్ రిపోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. – బొబ్బిలి, రాజాం



బొబ్బిలి: 30,31 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు



రేగిడి: పారంపేటలో రోగులకు మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



సంతకవిటి: మోదుగులపేటలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్



మెంటాడ: ఇప్పలవలసలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను తిలకిస్తున్న ఎంపీప రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు

జగనన్న ఆరోగ్య శిబిరాలకు ఆదరణ

బొబ్బిలి: మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందని, ఇప్పటి వరకు 16 శిబిరాలు నిర్వహించి 12,500 మందికి వైద్య పరీక్షలు, మందులు అందజేశామని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్ మాట్లాడుతూ.. మండలంలోని 44 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. రీసర్వే జరిగే గ్రామాల్లో వెబ్‌లాండ్ రికార్డులు కొన్ని ఓపెన్ కాని కారణంగా మీసేవలో డౌన్‌లోడ్ చేసుకున్న వన్‌బీని తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే అటెస్ట్ చేసి ఇస్తామని, దాన్ని వివిధ కార్యక్రమాలకు అధికారికంగా వినియోగించుకోవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు వినియోగించుకోవాలన్నారు. పారాది, మెట్టవలస గ్రామాల్లో కొన్ని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని చర్యలు తీసుకోవాలని సభ్యులు డీటీకి వినతిపత్రాలు అందజేశారు. ఇందిరమ్మ కాలనీలోని ఇళ్ల సర్వేకు 12మంది వీఆర్వోలను వినియోగిస్తున్నామని, మరో పక్క రీసర్వే జరుగుతున్నందున త్వరలోనే సభ్యుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు. ఎంపీడీఓ పోతుల రవికుమార్, వైస్ ఎంపీపీ డోకల జ్యోతి, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, ఈఓపీఆర్డీ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆకట్టుకున్న కోలాటం



కోలాట ప్రదర్శనలో కళాకారులు

రాజాం: పట్టణంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ధర్మప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శివ మెహర్ తరుణ్ బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. కార్యక్రమం అనంతరం కోలాటం బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఆలయ ధర్మకర్త దుర్గాప్రసాద్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, కమిటీ సభ్యులు సలాది తులసీరావు, గ్రంధి గోపి, వెంపల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు.. సంక్షేమానికి నాంది

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు



సంక్షేమ పథకాల లబ్ధిపత్రాన్ని అందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: నవరత్నాలతో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నాంది పలికిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులులు అన్నారు. మండలంలోని వాల్తేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై ఆరాతీశారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతుండడంతో వారంతా ఎంపీ, ఎమ్మెల్యే వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు సైతం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ.. విద్య, వైద్యానికి ఈ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మీరంతా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైస్ ఎంపీపీలు గురుగుబెల్లి పావని, పండు పాపారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ గురుగుబెల్లి గవరయ్య, స్థానిక సర్పంచ్ గురుగుబెల్లి చిన్నమ్మడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, పలు పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్



సిబ్బందికి సూచనలు చేస్తున్న జెడ్పీసీఈఓ రాజ్‌కుమార్

బాడంగి: ప్రభుత్వ ఉద్యోగులు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం, గడపగపడకు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, జగనన్న కాలనీ ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. సచివాలయాల పరిధిలో చేపట్టే నిర్మాణాలకు ఈఏలు బాధ్యత వహించాలని, గడపగడపకు పనులకు పీఆర్‌జేఈ బాధ్యత తీసుకుంటారన్నారు. గృహ నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలు ఈఏల లాగిన్‌లోకి వచ్చిన వెంటనే బిల్లులు చెల్లించవచ్చన్నారు. భీమవరం ఈఏ లావణ్య మూడురోజుల పాటు సెలవు పెట్టారని, సెలవు పూర్తయినా విధుల్లోకి రావడం లేదని ఎంపీడీఓ చెప్పగా.. ఆమెపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఆదేశించారు. సమావేశంలో పీఆర్, హౌసింగ్ డీఈఈలు అప్పారావు, అప్పయ్య, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావు, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



రాజాం: తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న రమాదేవి

రాజాం: తూటికాడ కషాయంతో పంటలను ఆశించే సుడిదోమ, తెల్లదోమను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్1 రమాదేవి అన్నారు. మండలంలోని బొమ్మినాయుడువలసలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విధానం, కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతిలో లభించే ఆకులతో కషాయాన్ని ఏవిధంగా తయారు చేసుకోవచ్చు, ఎలా వినియోగించాలి, తదితర అంశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రావణి, వీఏఏ రేనుకాచౌదరి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణంతో చీడపీడల నివారణ

రేగిడి: కూరగాయల సాగులో జిల్లేడు ద్రావణాన్ని వినియోగించడం ద్వారా పంటలను ఆశించే చీడపీడల నివారణతో పాటు మంచి ఫలసాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు అన్నారు. మండలంలో సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లో రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీలు లక్షున్నాయుడు, వరలక్ష్మి, రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దీపారాధన



దీపారాధన చేస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో వీరహనుమాన్ ఆలయం వద్ద వేంకటేశ్వర వైభవ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయంలో ఊంజల్ సేవ, సామూహిక దీపారాధన, లక్ష్మీపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పూడికల తొలగింపు

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి పంచాయతీ నర్సింహపురంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. ఇళ్లలోని చెత్తను కాలువల్లో వేయకుండా క్లాప్ మిత్రలకు అందించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, కార్యదర్శి దిలీప్ గ్రామస్తులకు సూచించారు.

రీసర్వేతో కచ్చితమైన హద్దులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులకు స్పష్టమైన రికార్డులు, కచ్చితమైన హద్దులు లభిస్తాయని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగవలసలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను శుక్రవారం పర్యవేక్షించారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల సమక్షంలో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సివిల్స్ కోచింగ్ మెటీరియల్ ఆవిష్కరణ



కోచింగ్ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, తదితరులు

బొబ్బిలి: డిగ్రీ విద్యార్థులకు యూపీఎస్సీ (సివిల్స్) గైడెన్స్, కోచింగ్ మెటీరియల్‌ను అందించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం సివిల్స్ కోచింగ్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రౌతు రామమూర్తినాయుడు, కాలేజ్ కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపాల్ రెడ్డి మోహనరావు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ స్పెషల్ డ్రైవ్



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

బొబ్బిలి: సారా, గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. పట్టణంలోని పాత బొబ్బిలి వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిషేధిత పదార్థాలు తరలిస్తూ పట్టుబడినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి బోరు ప్రారంభం

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి బోరును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు శుక్రవారం ప్రారంభించారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రపూడి రమేష్, బబ్లు, 15వ వార్డు కౌన్సిలర్ ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.